పల్లె టేస్ట్ మారింది గురూ!





కోడి కూతతో నిద్రలేచి, పొద్దు వాలీవాలగానే సద్దుమణిగే పల్లెలు ఇప్పుడు లేవు. పేడ కళ్లాపి చప్పుళ్లు.. పదండి.. పదండి... అంటూ సేద్యపు పనులకు మనుషులను కూడేసుకునే పిలుపులూ.. ఇవన్నీ ఇప్పుడు అంతరించిన దృశ్యాలు..

కాలంతో పాటూ మార్పు సహజం. ఆహార, వేష, భాషలు సహా సకల జీవన వ్యాపారాలనూ ఈ మార్పు ప్రభావితం చేస్తుంది. సమాచారాన్ని క్షణాల్లో అరచేతిలోకి చేర్చే సాంకేతిక యుగంలో వేగం పెరిగింది. నగరాలకు పల్లెలు అనుకరణలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఆహారపు అలవాట్ల విషయంలో.

రాగి ముద్దా.. సెనిగ్గింజల ఊరుబిండీ, సద్దెన్నం.. వంకాయ బజ్జీ, వంగ ఒరుగులూ.. గురుగాకు పులగూరా.. వంటి పల్లె వంటలు ఇప్పుడు స్టార్ హోటళ్లలో ఖరీదైన డిష్‌లుగా మారిపోగా, నూడుల్స్, బకెట్ చికెన్ లెగ్ పీస్‌లు, చాట్‌లూ పానీపూరీ వంటివి పల్లె నట్టింట తిష్టవేశాయి. నగరవాసులు పల్లె రుచులకోసం అర్రులు చాస్తూవుంటే, పల్లెజనం.. ఫాస్ట్ ఫుడ్ కోసం ఎగబడుతున్నారు.

తిరుపతి, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

గత పదేళ్లలో జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజల ఆహారపుటలవాట్లలో గణనీయమైన మార్పు చోటు చేసుకుంది. మారుమూల పల్లెల్లో కూడా గోబీ, మష్రూమ్, చికెన్ ఫ్రైడ్ రైస్‌లు, మంచూరియాలు ప్రజలకు లభిస్తున్నాయి. ఇక పానీ పూరీ బండ్లు కనిపించని పల్లె లేదంటే అతిశయోక్తి కాదు. మెట్రో నగరాలకే పరిమితమైన ఆహార పదార్థాలు తిరుపతిని తాకి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నాయుడుపేట, గూడూరు, వెంకటగిరి వంటి పట్టణాలకు విస్తరించి, పల్లెలకు సైతం చేరువలోకి వచ్చాయి. పదేళ్ల కిందటి దాకా సాయంత్రమైతే పిల్లలు, యువత మిర్చి బజ్జీలు, బోండాలు, వడలు వంటివి తినడానికి ఆసక్తి చూపేవారు. అవి కూడా మండల కేంద్రాలు, ఓ మోస్తరు గ్రామ కేంద్రాల్లోనే దొరికేవి. ఇప్పుడా స్థానంలోకి పానీ పూరీ, మసాలా పూరీ, ఛాట్ మసాలా, ఫ్రైడ్ రైస్, నూడిల్స్ వంటివి చేరాయి. పట్టణాలు, నగరాల్లో చదువుకుంటున్న విద్యార్థులు, ఉద్యోగ వ్యాపారాలకు వెళ్ళి వచ్చే యువత వీటినే ఇష్టపడుతున్నారు.

ఆదివారం ప్రత్యేకం

250కి పైగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు



పాకాలలో స్టార్ హోటళ్ల తరహా చికెన్ వెరయిటీ ఐటెమ్స్ దొరికే ఒక హోటల్ ఇది. మండల కేంద్రాలూ, కాస్త పెద్ద గ్రామాల్లోనే ఇటువంటివి జిల్లాలో 250 ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. గోబీ, మష్రూమ్, చికెన్ ఫ్రైడ్ రైస్ మంచూరియాలు వీటిల్లో దొరుకుతాయి. చంద్రగిరి మండలంలోనే ఇటువంటివి 36 ఉన్నాయి. వరదయ్యపాలెం మండలంలో 35, చిల్లకూరులో 22, తడ మండలంలో 20, చిట్టమూరు మండలంలో 17, నాయుడుపేట మండలంలో 16, తొట్టంబబేడు మండలంలో 13, రేణిగుంట మండలంలో 10 వంతున ఈ ఆధునిక ఫుడ్ సెంటర్లు నడుస్తున్నాయంటేనే పల్లెల్లో వీటికి ఎంత క్రేజ్ ఉందో అర్థమవుతుంది.

అలవాటు మారి.. పానీపూరీ



పీచుమిఠాయిల కాలం పోయింది. పిల్లలు ఎగబడి తినే తిండి ఇప్పుడు పానీపూరీ. ఎడ్ల బండ్ల కోసం వెతుక్కోవాలి గానీ, పానీపూరీ బండి లేని పల్లె కనిపించదు. జిల్లాలోని పల్లెల్లో కనీసం మూడొందల పానీపూరీ బండ్లు ఉన్నాయని అంచనా. మండల కేంద్రాల్లో అయితే నాలుగైదు ఉంటాయి. అద్దె కట్టనవసరం లేదు. టాక్స్‌ల గొడవ లేదు. కరెంటు బిల్లుల భారం ఉండదు. కొన్ని గంటలు తెరిచి ఉంచితే చాలు వ్యాపారం జోరుగా సాగుతుంది. కేవీబీపురంలో రోడ్డు పక్కన ఈ పానీపూరీ బండి తరహాలోనే అన్ని పల్లెల్లోనూ వెలిశాయి.

పల్లె పల్లెనా...



రేణిగుంటలో ఫైవ్ స్టార్ పేరిట చికెన్ వెరైటీస్ లభించే హోటల్

వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి చాలా చిన్న మండల కేంద్రం. అక్కడ ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు రెండు, పానీ పూరీ బండి ఒకటి వుండడమే ఆశ్చర్యకరమైతే ఆ మండలంలోని వెంగమాంబపురంలో ఒకటి, జయంపులో మూడు చొప్పున ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నడుస్తున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురంలో రెండు బిర్యానీ హోటళ్ళు, ఒక పానీపూరీ బండి నడుపుతున్నారు. జిల్లాలోనే వెనుకబడిన, మారుమూల మండలమైన ఎర్రావారిపాలెంలో కూడా ఎనిమిది పానీపూరీ బండ్లు వుండడం విస్తుగొలుపుతోంది.



బీఎన్ కండ్రిగలోని ఒక ఫాస్ట్ ఫుడ్ సెంటర్

నగరాలకు దీటుగా



తడ మండలం బోడిలింగాల పాడు వద్ద స్టార్ హోటల్

చంద్రగిరి, తడ, వరదయ్యపాలెం, చిల్లకూరు తదితర మండలాల్లో నగరాలకు దీటుగా హోటళ్ళు, రెస్టారెంట్లు నడుస్తున్నాయి. జాతీయ రహదారులపై వుండడం, పారిశ్రామికాభివృద్ధి వంటివి దీనికి కారణం. తడలో మూడు స్టార్ హోటళ్ళు, 20 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, 33 రెస్టారెంట్లు (అందులో 25 ఏసీ), మరో 6 దాబా హోటళ్ళు చొప్పున మొత్తం 62 వున్నాయి. పరిశ్రమలు లేకున్నా తిరుపతికి చేరువగా వుండడం, జాతీయ రహదారుల కారణంగా చంద్రగిరిలో 36 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, 12 రెస్టారెంట్లు, 22 దాబా హోటళ్ళు వున్నాయి. వరదయ్యపాలెం మండలంలో 35 ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, ఒక దాబా హోటల్ వుండగా చిల్లకూరు మండలంలో 22 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, 2 రెస్టారెంట్లు, 3 దాబాలు చొప్పున మొత్తం 27 నడుస్తున్నాయి.

డాబాకి పోదామా!



రేణిగుంటలోని ఒక హోటల్ ఇది

డాబా కల్చర్ పెరిగింది. ముఖ్యంగా రహదారులకు దగ్గరగా ఉన్న ఊళ్ల సమీపంలో డాబాలు వెలుస్తున్నాయి. ప్రయాణీకులతో పాటూ, స్థానిక యువత, కుటుంబాలు.. కాస్త విశ్రాంతిగా వీటికి వెళ్లి తినడం అలవాటు చేసుకున్నారు. చికెన్, మటన్, ఫిష్, ప్రాన్స్ తదితర మాంసాహార వంటకాలపై జనంలో పెరిగిన అనురక్తిని గ్రహించి వీటిని ఏర్పాటు చేస్తున్నారు. 65, కబాబ్, ఫ్రై, తందూరీ వంటి వంటకాలు, బిరియానీలతో పాటూ ఇక్కడ లభిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ కలిగిన కేఎఫ్‌సీ (కెంటకీ ఫ్రైడ్ చికెన్) ని అనుకరిస్తూ ఎక్కడికక్కడ మండల కేంద్రాల్లో కూడా లోకల్ వెరైటీ ఫ్రైడ్ చికెన్ హోటళ్ళు తెరుస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి రెస్టారెంట్లు, దాబాలు, హోటళ్ళు 150కి పైగా వుండగా అందులో 40 దాకా ఏసీ సదుపాయం కలిగి వున్నాయి.

కంచుగడప నుంచే స్థానికులకు దర్శనం

శ్రీకాళహస్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో స్థానికులకు కేటాయించిన టైంస్లాట్‌లో కంచుగడప నుంచే నేరుగా దర్శనానికి అనుమతిస్తామని ఈవో చంద్రశేఖర్ ఆజాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల ముక్కంటి ఆలయంలో స్థానికులకు ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 7 నుంచి 8.30 గంటల వరకు దర్శనానికి అనుమతించేలా ప్రత్యేక టైంస్లాట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ముందుగా స్థానికులు ఆధార్‌కార్డుతో పీఆర్వో కార్యాలయానికి వెళ్లి అనుమతి రసీదు పొందిన తర్వాత కంచుగడప వద్ద చూపి ఆలయంలోకి వెళ్లేవిధంగా నిబంధనలు పెట్టారు. దీనిపై స్థానిక ప్రజలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దాంతో పీఆర్వో కార్యాలయానికి వెళ్లి రసీదు తీసుకునే నిబంధనకు సడలింపు ఇస్తున్నట్లు ఈవో పేర్కొన్నారు. కంచు గడప వద్ద నేరుగా ఆధార్‌కార్డు చూపి దర్శనానికి ప్రవేశించవచ్చని ప్రకటించారు.

విజన్ డాక్యుమెంట్ తయారీకి ఐఐటీ, ఐసర్ సలహాలు అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ తయారీలో ఐఐటీ, ఐసర్, ప్రముఖ యూనివర్సిటీల సబ్జెక్టు నిష్ణాతుల సలహాలు, సూచనలు అవసరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఏర్పేడు ఐఐటీలోని కాన్ఫరెన్సు హాల్‌లో శనివారం సాయంత్రం ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, యూనివర్సిటీల సబ్జెక్టు నిపుణులతో తిరుపతి జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీపై జేసీ శుభం బన్సల్‌తో కలిసి కన్సల్టేటివ్ వర్క్‌షాపు నిర్వహించారు. జిల్లా గ్రోత్ రేట్ 15 శాతానికి తగ్గకుండా ఉండేలా పలు అంశాలపై చర్చించారు. పర్యాటక, ఆతిథ్యరంగం, విద్య, పరిశ్రమలు, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ ప్రమోషన్, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, వెంకటగిరి చీరలు, శ్రీకాళహస్తి కలంకారీ తదితర అంశాలపై నిపుణులు పలు సలహాలు, సూచనలు అందించారు. ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా పరిశ్రమల అవసరాల మేరకు నిపుణులను తయారు చేయాల్సి ఉంటుందని సూచించారు. గ్రామాలు, విద్యాసంస్థలు లింకేజీ చేయడం ద్వారా చాలా ఉపయోగం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరవింద్‌కుమార్, రాహుల్ సిరోహి, చంద్రశేఖర్, హేమంత్‌కుమార్, ఉమాశంకర్, సత్య, నాగరాజు, రామారావు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఐసర్ అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా భూమన

తిరుపతి (జీవకోన), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. చిత్తూరు జిల్లాతో పాటు తిరుపతి జిల్లాకు చెందిన తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు ఆయన అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా భూమనను పలువురు అభినందించారు.

సీఎం సహాయనిధికి అప్సా రూ.64 లక్షల విరాళం

తిరుపతి విద్య, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.64,04,854 అందజేసింది. అప్సా రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రహ్మణ్యంరాజు శుక్రవారం రాత్రి విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో సీఎం చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఈ మొత్తాన్ని అందజేస్తున్నట్టు ఆయన ముఖ్యమంత్రికి చెప్పారు.



ముఖ్యమంత్రికి చెక్కు అందజేస్తున్న అప్సా రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యారాజు

తిరుచ్చి వాహనంపై కల్యాణ వెంకన్న దర్శనం



చంద్రగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తిరుచ్చి వాహనంపై స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య సేవల్లో భాగంగా ఆలయంలో ఉదయం స్వామివారి సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్ సేవను కన్నులపండువగా జరిగింది. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లను విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠించారు. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజి రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడిఫై స్కూల్‌కు రాష్ట్రంలో మొదటి ర్యాంకు



అవార్డు అందుకుంటున్న ఎడిఫై స్కూల్ డైరెక్టర్ ప్రణీత్

తిరుచానూరు. అక్టోబరు 19(ఆంధ్ర జ్యోతి): తిరుపతికి చెందిన ఎడిఫై స్కూల్ స్టూడెంట్ లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ విభాగంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. దేశంలో ఆరవ స్థానం దక్కిందని పాఠశాల డైరెక్టర్ ప్రణీత్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్‌గ్రాండ్ జ్యూరీ ర్యాంకింగ్స్‌లో ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ సందర్భంగా పద్మావతి విద్యా సంస్థల ఛైర్‌పర్సన్ సులోచనాదేవి పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

ఉద్యోగాలకు ఎస్డీహెచ్‌ఆర్ కళాశాల విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఛైర్మన్ చక్రవర్తిరెడ్డి

తిరుపతి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): న్యూ బాలాజీ కాలనీలోని ఎస్డీహెచ్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో ఫస్ట్ సోర్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 178మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కాలేజి ప్రిన్సిపాల్ ఎ.ఉష ఈమేరకు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఛైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

సప్లై ఛానల్ పునరుద్ధరణ పనులు



సి.మల్లవరం వద్ద ఎక్స్‌కవేటర్‌తో పనులు

తిరుపతి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలో స్వర్ణముఖినది నుంచి సి.మల్లవరం పంచాయతీ మీదుగా పేరూరు చెరువుకు నీరు చేరే ప్రధాన సప్లై ఛానల్ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఎమ్మెల్యే పులివర్తినానీ ఆదేశాల మేరకు పేరూరు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగూరు శ్రీనువాసులు నేతృత్వంలో శనివారం తొండవాడ నుంచి సి.మల్లవరం మీదుగా వచ్చే సప్లై ఛానల్‌లో ఎక్స్‌కవేటర్ సాయంతో పనులు చేపట్టారు. ఆక్రమణలను తొలగించి సాగునీరు కాలువల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

సీమ పందుల పెంపకంపై ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న శ్రీలత

తిరుపతిరూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఎస్వీవెటర్నరీ వర్సిటీలో నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల ద్వారా సీమపందుల పెంపకంపై నిర్వహించిన మూడ్రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత ఈ సందర్భంగా మాట్లాడుతూ.. శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానంతో శాస్త్రీయ పద్ధతుల ద్వారా సీమపందుల పెంపకం చేపట్టి ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. కేంద్రం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాత మాట్లాడుతూ సీమపందుల పెంపకాన్ని ఆదాయవనరుగా చేపట్టాలన్నారు. రైతులు, యువత వర్సిటీలోని పందుల పరిశోధనా స్థానాన్ని సందర్శించి ప్రత్యక్ష అవగాహన పొందారు. శిక్షణలో పాల్గొన్న వారికి శ్రీలత సర్టిఫికెట్లు అందజేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.కళ్యాణచక్రవర్తి, డాక్టర్ జి.విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ పి.మంజరి, రైతులు పాల్గొన్నారు

అధ్వానంగా అన్నమయ్య సర్కిల్-ఆర్సీపురం రోడ్డు



తిరుపతి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సర్కిల్ నుంచి ఆర్సీపురానికి వెళ్లే మార్గం అధ్వానంగా తయారైంది. ప్రతినిత్యం ఈ దారిలో వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. అవిలాల సర్కిల్ వరకు ఈరోడ్డు రెండువైపులా పలుచోట్ల కంకరతేలిపోయింది. గతుకులు, గుంతలమయంగా మారింది. ప్రధానం ఎంఆర్‌పల్లె పోలీస్‌స్టేషన్ నుంచి అన్నమయ్య సర్కిల్ వచ్చే రోడ్డులో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దీనికి తోడు రోడు మధ్యలో రెండుచోట్ల తవ్వేసి రాళ్లని అడ్డంగాపోసి వదిలేశారు. పాదాచారులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇటీవల వర్షాలకు రోడ్డుకు రెండువైపులా పలుచోట్ల నీరు నిలిచిపోయింది. వర్షాలు తగ్గి రెండురోజులవుతున్నా నీరు అలాగేఉంది. వాహన చోదకులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదానికి లోనయ్యే అవకాశముంది.

ఎస్వీయూ ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్



మొక్కలకు నీరు పోస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు, ఉద్యోగులు ఉత్సాహంగా ఇందులో పాల్గొన్నారు. పలు గదులు, భవనాల వెలుపల చెత్తా చెదారం, కలుపు మొక్కలు తొలగించారు. వామనరావు భవన్ ముందు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు మొక్కలు నాటారు. క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో పాల్గొన్న వారిని అభినందించారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ప్రొఫెసర్ చెంద్రాయుడు, వర్సిటీ ఎన్ఎస్ఎస్ అధికారులు ప్రొఫెసర్ దామోదరం, డాక్టర్ పాకనాటి హరికృష్ణ, కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన అలిపిరి



తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తమిళులు ఎంతో పవిత్రంగా బావించే పెరటాసి మాసం ఐదో శనివారం కావడంతో తిరుమలకు కాలినడకన వెళ్లే భక్తులతో అలిపిరి కిటకిటలాడింది. పాదాల మండపం నుంచి గాలి గోపురం వరకు పోటెత్తారు. మహిళలు దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు.

పల్సర్ బైక్ చోరీ

చంద్రగిరి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాహ్మణవీధిలో బైక్ చోరీ గురైయింది. పోలీసుల కథనం మేరకు బ్రాహ్మణవీధిలో మునస్వామి తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు శుక్రవారం రాత్రి పార్క్ చేశాడు. శనివారం ఉదయం లేచి చూసేసరికి ఇంటి ముందు బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



వెంకటేషన్,సుధ,చెర్రీ

తిరుమల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. జాతీయ సఫాయి కరంచారీస్ కమిషన్ ఛైర్మన్ ఎం వెంకటేషన్, సినీ నిర్మాత చెర్రీ, బద్వేలు ఎమ్మెల్యే దాసరి సుధ, తెలంగాణ ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించారు.

నవంబరులో ఎస్వీయూ యూత్ ఫెస్టివల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో నవంబరు 9, 10 తేదీల్లో యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి తెలిపారు. యూనివర్సిటీతో పాటు అనుబంధ కాలేజీల విద్యార్థులకు సాంస్కృతిక, ప్రతిభా పోటీలు నిర్వహిస్తామన్నారు.విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్టు చెప్పారు.

బాలిక అదృశ్యంపై కేసు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన శ్రీనివాసులు కుమార్తె(14) అదృశ్యంపై కేసు నమోదయ్యింది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు బాలిక శనివారం మధ్యాహ్నం నుంచి కనపడకపోవడంతో కుటుంబీకులు ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సీఐ శ్రీనివాసులు బాలిక ఇంటి వద్దకు వెళ్లి ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను పరిశీలించారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి):ట్రాఫిక్ డ్యూటీలో వున్న కానిస్టేబుల్‌పై పాత నేరస్థుడొకరు దాడి చేసిన ఘటన శనివారం తిరుపతిలోని కపిలతీర్థం సర్కిల్ వద్ద చోటు చేసుకుంది. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు... కానిస్టేబుల్ సోమసుందరం కపిలతీర్థం వద్ద డ్యూటీ చేస్తుండగా వేదాంతపురానికి చెందిన పాత ముద్దాయి చంద్రమౌళి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించి వెళుతూ కన్పించాడు. కానిస్టేబుల్ అతడిని అడ్డగించడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగింది. తిరుచానూరు స్టేషన్‌లో ఒక హత్యాయత్నం కేసులో నిందితునిగా చంద్రమౌళి వున్నట్లు గుర్తించి అతడిని అరెస్టు చేశారు. దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి లోని చెంబేడు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. పంచనామా నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా నమోదు చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాలిపేట వీఆర్వో అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పాస్‌పోర్ట్ పొందడం... సులభతరం



● ఆన్‌లైన్‌లో వివరాలు సమర్పిస్తే చాలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్ట్ అనేది ఒకప్పుడు స్టేటస్ సింబల్. సంపన్న వర్గాలకే పరిమితమయ్యేది. కాలం మారింది. విద్యారంగ మార్పుల ఫలితంగా సాధారణ విద్యార్థి కూడా విదేశమెళ్లి ఉద్యోగం చేస్తున్నాడు. మధ్య తరగతి వారు వెళుతున్నారు. గల్ఫ్‌లో ఉపాధి అవకాశాలు పెరిగి చదువుతో పనిలేకుండా వలసబాట పడుతున్నారు. దీంతో అన్ని వర్గాలకూ ఇప్పుడు పాస్‌పోర్ట్ అవసరంగా మారిపోయింది. అందుకే గతంలో ప్రహసంగా ఉండే దరఖాస్తు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం సులభతరం చేసింది. పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి పడిగాపులు కాయకుండా ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.

యాప్ ద్వారా దరఖాస్తు ఇలా..

- కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్‌లో ఎం.పాస్‌పోర్ట్ అనే సేవాయాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేశాక న్యూ యూజర్ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేయాలి.
- చిరునామా ఆధారంగా పాస్‌పోర్టు కార్యాలయాన్ని ఎంచుకోవాలి.
- పేరు, పుట్టిన తేదీ, ఈ మెయిల్ ఐడీ లాంటి సమాచారం నమోదు చేయాలి. లాగిన్ ఐడీ అయ్యాక పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. సెక్యూరిటీ కోసం ఓ ప్రశ్న, సమాధానం ఎంచుకోవాలి. క్యాప్చా కోడ్‌ను కూడా నమోదు చేసి సబ్మిట్ వద్ద క్లిక్ చేయాలి. ఐడీ, పాస్‌వర్డ్‌లను మాత్రం మర్చిపోకూడదు సుమా.
- పాస్‌పోర్టు కార్యాలయం ద్వారా దరఖాస్తుదారుడి మెయిల్‌కు ఓ ధ్రువీకరణ లింకు వస్తుంది. దీన్ని క్లిక్ చేస్తే వెబ్ పేజీ ఓపెన్ అవుతుంది. ధ్రువీకరణకు మీ లాగిన్ ఐడీ నమోదు చేయాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ఖాతా ధ్రువీకరించుకుని యాప్‌ను క్లోజ్ చేసి మళ్లీ లాగిన్ చేయాలి.
- అప్లై ఫర్ పాస్‌పోర్టు వద్ద మళ్లీ క్లిక్ చేయాలి. అక్కడ కోరిన సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఆధార్, చిరునామా వివరాలు తప్పనిసరి. తర్వాత పాసుపోర్టు కోసం ఆన్‌లైన్‌లో రూ.1,500 చెల్లించాలి. అపాయింట్‌మెంట్ తేదీని నిర్ణయించుకుని సంబంధిత కాలమ్‌లో ప్రస్తావించాలి.
- దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యాక పాస్‌పోర్టు కేంద్రానికి వెళ్లి అవసరమైన పత్రాలను అందజేయాలి.
- సర్టిఫికెట్లు ఓకే అయ్యాక కొన్ని రోజుల్లోనే పోలీసు వెరిఫికేషన్ జరుగుతుంది. స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ వచ్చి నేరచరిత్ర లాంటి వివరాలపై విచారిస్తారు. అనంతరం వారం రోజుల్లో ఇంటికి పాస్‌పోర్టు అందుతుందని పాస్‌పోర్టు సేవా కేంద్రం అధికారులు చెప్పారు.

సఫాయి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

● జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ సఫాయి కర్మచారీ కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రోగుల సేవలో తరిస్తున్న సఫాయి కర్మచారి(పారిశుధ్య కార్మికులు)లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను సక్రమంగా వర్తింపజేయాలని, వారికి ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్ వైద్యాధికారులకు ఆదేశించారు. రుయాస్పత్రి, స్విమ్స్‌లను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రుయాస్పత్రిలో పారిశుధ్య కార్మికులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేదని, ఈఎస్ఐ, పీఎఫ్‌లు చెల్లించడంలేదని, డ్యూటీలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదని కార్మికులు తెలిపారు. వెంటనే ఆయన కాంట్రాక్టు నిర్వాహకులను పిలిచి మందలించారు. బిల్లులు రాకపోవడం వల్ల జీతాలు ఇవ్వడం కొంత ఆలస్యమైందని ఏ-1 కాంట్రాక్టు నిర్వాహకుడు రవికుమార్ చెప్పగా వెంటనే ఫోన్లో డీఎంఈ నరసింహులుతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్మికులకు పది రోజుల్లో జీతాలు చెల్లించాలని, నిబంధనల మేరకు వారికి సదుపాయాలు కల్పించాలని కాంట్రాక్టు నిర్వాహకులకు ఆదేశించారు. అనంతరం స్విమ్స్‌కు చేరుకుని స్విమ్స్ అధికారులు, సఫాయి కార్మికులు, కర్మచారీ సంఘం నేతలతో సమీక్షించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా తన కార్యాలయ నంబరు 011-24648924కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు. సూపరింటెండెంట్ రవిప్రభు, ఏఆర్ఎంవో హరికృష్ణ, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న సఫాయి కర్మచారీలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కర్మచారి కమిషన్ ఛైర్మన్ వెంకటేశన్ తెలిపారు. కార్పొరేషన్‌లో సఫాయి కార్మికుల సమస్యలపై కమిషనర్ మౌర్యతో కలసి సమీక్షించారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ మస్టర్ గదులు తక్కువగా ఉన్నాయని, మహిళల కోసం ప్రత్యేక గదులు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

మరం భూముల్లో ఇక నిర్మాణాలకు అనుమతి ఇవ్వకండి

● పంచాయతీ కార్యదర్శులకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

తిరుపతి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పులివర్తినానీ స్పష్టం చేశారు. తిరుపతిరూరల్‌మండల ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొత్తగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శులకు స్థానిక సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..గతవైసీపీ పాలనలో పంచాయతీ నిధులు పక్కదారి మళ్లించడం ద్వారా గ్రామ అభివృద్ధిలో పూర్తిగా విఫలమయ్యారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీసీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. అధికారులు కూడా ఆదిశగా పనిచేయాలన్నారు. గతప్రభుత్వంలోని పంచాయతీ కార్యదర్శులు మరం భూములకు ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడంతో పలు అక్రమ నిర్మాణాలు జరిగాయన్నారు. దీంతో వర్షాలు వచ్చినపుడు పలుప్రాంతాల్లో వరదనీరు చేరి పేదప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎట్టిపరిస్థితిల్లోనూ మరంభూమిలో నిర్మాణాలకు అనుమతి ఇవ్వొద్దని ఆదేశించారు. మండలంలో తాగునీరు, డ్రైనేజీ, శానిటేషన్, డంపింగ్ యార్డ్, పింఛన్లు, మరం భూములపై నివేదిక ఇవ్వాలని కోరారు. తుమ్మలగుంటపంచాయతీలో అనధికారికంగా కేవీఎస్ పేరిట అకౌంట్ నిర్వహిస్తున్నట్లు అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సీపీడీవో సుశీలాదేవి, ఎంపీడీవో రామచంద్ర, అధికారులు, టీడీపీరూరల్‌మండల పార్టీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నేతలు వైకుంఠం శ్రీధర్‌నాయుడు, ఎ.మధు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు శ్రీరామ విద్యార్థుల ఎంపిక

తిరుపతిరూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి):బిగ్‌వర్క్స్ సంస్థ(హైదరాబాద్) నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కరకంబాడీ రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర తెలిపారు. వీరికి వార్షిక వేతనం రూ.4లక్షలు ఉంటుందన్నారు. విద్యార్థులను ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ టి.విష్ణువర్ధన్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్, అధ్యాపకులు, అభినందించారు.

నీటి సమస్యకు నివారణ చర్యలు

● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలం మంగళం పరిధిలోని రణధీరపురం, సప్తగిరికాలనీల్లో నీటి సమస్య నివారణకు చర్యలు చేపట్టారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'రణధీరపురంలో నీటిసమస్య' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమాద్రి, సర్పంచ్ లక్ష్మీనారాయణ సెక్రటరి నాగరాజు తదితర సిబ్బంది సమావేశమై నీటి సమస్యపై చర్చించారు. అనంతరం నీటి ట్యాంకులు, మోటారు పంపింగ్, గేటువాల్వ్‌లు, వీధికొళాయిలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఐదు గేటువాల్వ్‌లను తొలగించి కొత్తవి ఏర్పాటుచేయడం, లీకేజీలను అరికట్టడం, కొత్తగా ఒక బోరు వేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. వారం వ్యవధిలో చర్యలు పూర్తిచేస్తామని ఏఈ తెలిపారు. నివాసాలకు నీటి కొరత లేకుండా నాలుగు రోజులకు ఓసారి వదిలేందుకు అనుమతి ఇచ్చామన్నారు. భవిష్యత్తులో కూడా నీటి సమస్య రాకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.

17న తిరుపతి ఐఎంఏ శాఖ ఎన్నికలు



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఐఎంఏ నేతలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఎంఏ శాఖకు వచ్చే నెల 17న ఎన్నికలు నిర్వహిస్తామని ఐఎంఏ తిరుపతి శాఖ అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్ పేర్కొన్నారు. ఐఎంఏ నేతలతో కలిసి ఆయన శనివారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి నవంబరు 4 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. స్థానిక రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని ఎస్వీ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో నామినేషన్లు స్వీకరిస్తారన్నారు. నవంబరు 5 పరిశీలన, 7న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ ఆనందనాయుడు వ్యవహరిస్తారని వివరించారు.

ప్రతి మంగళవారం తిరుమల దర్శనం కల్పించాలంటూ కాంగ్రెస్ నిరసన



తిరుపతి(వైద్యం), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూపై విమర్శలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఇమేజ్‌ని పోగొట్టుకున్నాడని, టీటీడీ పవిత్రత, ఉద్యోగుల పనితీరును ప్రపంచమంతా పొగుడుతోందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ పేర్కొన్నారు. స్థానిక టీటీడీ పరిపాలన భవనం ముందు ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి స్థానికులకు తిరిగి ప్రతీ మంగళవారం శ్రీవారి ఉచిత ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ మార్కెటింగ్ విభాగంలో రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని, ఆ ఖర్చులకు సంబంధించి లెక్కలను, రేట్లకు సంబంధించిన బోర్డులను అందరికీ తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, రావణ్, శివ, తేజోవతి, శాంతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి కొత్త బస్సులు



తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 19: జిల్లాకు ఆరు ఏపీఎస్ ఆర్టీసీ నూతన బస్సులు వచ్చాయి. సొంత బస్సులు మూడు, అద్దె బస్సులు మూడు రిజిస్ట్రేషన్‌కోసం కరకంబాడి రోడ్డులోని ఆర్టీవో కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్నాయి. భారత్‌స్టేజ్ 6, అశోక్‌లేల్యాండ్ ఇంజన్, 36సీట్ల సామర్థ్యం వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారుచేయబడిన రెండు సూపర్‌లగ్జరీ బస్సులు తిరుపతి-విజయవాడ మధ్య నడవనున్నాయి. 50సీట్ల సామర్థ్యంతో నాలుగు ఎక్స్‌ప్రెస్‌బస్సుల్లో తిరుపతి-కాణిపాకం రెండు, తిరుపతి-వాకాడు, వెంకటగిరి ఒక్కొక్కటి చొప్పున తిరుగనున్నాయి. వారం రోజుల వ్యవధిలో ఈ బస్సులు రోడెక్కనున్నాయి.



టీటీడీ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో 59 నామినేషన్లు



నామినేషన్ వేసేందుకు వెళ్తున్న కిషోర్‌కుమార్ తదితరులు



నామినేషన్ దాఖలు చేస్తున్న చీర్ల కిరణ్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో శనివారం నామినేషన్ల ఘట్టం ముగిసింది. ఏడు డైరెక్టర్ పోస్టులకు 43 మంది 59 నామినేషన్లు దాఖలు చేశారు. సీఐటీయు మద్దతుదారులు ర్యాలీగా టీటీడీ పరిపాలన భవనం వరకు వచ్చి పి.రత్నప్రభాకర్, ఎన్.పద్మనాభం, పి.దయాకర్‌ల నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి, కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉమాపతికి అందజేశారు. ఆదివారం ఉదయం నామినేషన్ల పరిశీలన జరుగుతుందని ఆర్వో చెప్పారు. 28వతేది మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. సహకార సంఘంలో 6,349 మంది సభ్యులు ఉన్నారు. తిరుమలలో ఎస్వీ హైస్కూలు, తిరుపతిలోని ఎస్‌జీఎస్ హైస్కూలులో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డైరెక్టర్ అభ్యర్థిగా చీర్ల కిరణ్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. తనతో పాటు ప్యానల్ సభ్యులైన గుంటూరు రేఖ, వంకీపురం పవన్, సునీల్‌కుమార్‌యాదవ్, మణికంఠలకు ఓటు చేసి గెలిపించాలని ఉద్యోగులను కోరారు.

తిరుపతి విద్య: టీటీడీ జూనియర్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ ఆర్.కిషోర్‌కుమార్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. దేవస్థానం విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్ మునిరెడ్డి, నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, దేవదాసు, ఈతమాకుల శైలేంద్రయాదవ్, టీజీ వెంకటకృష్ణ, ఆముదాల తులసీరామ్ తదితరులతో కలిసి ఆయన నామినేషన్ వేశారు.

తిరుపతి

మనగుడి



ఏడు పదుల మర్రిచెట్టు

మర్రి మహావృక్షంలో మునీశ్వరుడు

తిరుపతి దేవేంద్రా థియేటర్ సమీపంలో మూడెకరాల విస్తీర్ణంలో శివాలయం (కల్యాణాంబిక నీలకంఠేశ్వరాలయం), దాని వెనుకనే మునీశ్వరాలయం ఉన్నాయి. విశాలంగా విస్తరించిన మర్రిచెట్టును మునీశ్వరుడిగా కొలుస్తారు. నగరంలో అనేక మందికి మునీశ్వరుడు కులదైవం. పుట్టెంట్రుకలు తప్పనిసరిగా ఇక్కడే తీస్తారు. చెవులు కుట్టించడం, పొంగళ్లు పెట్టడం వంటివి చేస్తారు. ఆదివారం ఎక్కువ రద్దీగా ఉంటుంది. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 దాకా దర్శనం, పూజలు చేసుకోవచ్చు.



ప్రాంగణంలోని అక్కగార్లదేవతలు

ఇక శివాలయం ప్రాంగణంలో సుబ్రహ్మణ్యస్వామి, వినాయకస్వామి ఉపాలయాలు కూడా ఉన్నాయి. ప్రతి నెలలో ఏర్పడే మాస శివరాత్రి పర్వదినాన విశేష పూజలు నిర్వహిస్తారు. మూడునెలలకోసారి వచ్చే శనిత్రయోదశి పర్వదినాన శనిదేవునికి తైలాభిషేకం చేస్తారు. మహాశివరాత్రికి తొమ్మిది రోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ప్రతి సోమవారం ఉదయం 6.30గంటలకు నీలకంఠేశ్వరునికి ప్రత్యేక అభిషేకం జరుగుతుంది.

ఆలయవేళలు :
ఉ. 5.30నుంచి 11.30వరకు,
సా. 5.30నుంచి రాత్రి 8 దాకా.

- తిరుపతి అర్బన్



నీలకంఠేశ్వర గర్భగుడి

జంక్‌ఫుడ్‌ను నియంత్రిద్దాం

తిరుపతి (జీవకోన), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హాని కలిగించే జంక్ ఫుడ్‌ను నియంత్రిద్దామని ఆహార భద్రతా ప్రమాణాల అధికారులు మద్దిలేటి, నర్మద అన్నారు. ప్రపంచ ఆహార దిన వారోత్సవాలను పురస్కరించుకుని తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్‌లో శనివారం ఆరోగ్యానికి హాని కలిగించే జంక్‌ఫుడ్‌ను నియంత్రిద్దాం అనే అంశంపై సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ విచ్చలవిడిగా విక్రయిస్తున్న గోబి, పిజ్జా బర్గర్, రెడీమెడ్ చికెన్‌ఫ్రై ఆకర్షణీయంగా ఉండటానికి వాడే రంగులు, టేస్టీ సాల్ట్ ఆరోగ్యానికి హానికరమని తెలిపారు. అనారోగ్యాన్ని కలిగించేవి విక్రయించడం నేరమని, కల్తీగా నిరూపితమైతే రూ.5లక్షల వరకు జరిమానాతోపాటు జైలుశిక్ష ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రాజారెడ్డి, పాఠశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

థెరపీ మేనేజర్ ఆత్మహత్య



తేజేశ్వర్‌రెడ్డి

చిత్తూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చిత్తూరులో జరిగింది. రైల్వే ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. మెసానికల్ మైదానం సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఓ వ్యక్తి మృతదేహం ఉందని స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. తిరుపతిలోని ఓ కంపెనీలో థెరపీ మేనేజర్‌గా తేజేశ్వర్‌రెడ్డి పనిచేస్తున్నట్లుగా ఓ గుర్తింపు కార్డు లభించింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరికి గాయాలు



తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-తిరుపతి రహదారిలోని వకుళమాత ఆలయం వద్ద శనివారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం 150 బైపాస్ రోడ్డులో ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్‌లో వున్న రవిశంకర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో రుయాకు తరలించారు. ఈ ఘటనలో ట్రాక్టర్ బోల్తాపడి పూర్తిగా ధ్వంసమైంది. రవిశంకర్‌రెడ్డి అల్లుడు జీవన్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ముత్యాల రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన నగర సంకీర్తన

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శనివారం వేకువ జామున గోవిందరాజుల తేరువీధిలోని ఆంజనేయ స్వామి గుడి నుంచి గోవిందరాజ స్వామి ఆలయ నాలుగు మాడవీధుల్లో భక్తులు తిరునామాలు ధరించి, సంకీర్తనలు, భజనలతో నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గోపీనాథరెడ్డి సహా భక్తులు, గాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలి

- ముున్సిపల్ అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి నీటిశుద్ధి ప్లాంట్లు, డంపింగ్‌యార్డులు, సంపద కేంద్రాలు, భూసంబంధిత తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంకటగిరి ఈఎల్‌ఎస్‌ఆర్ నిర్మాణానికి సంబంధించిన సమస్య పరిష్కారమైందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. వెంకటగిరి, సూళ్లూరుపేట డంపింగ్ యార్డు అంశాలు, శ్రీకాళహస్తి ఎస్టీపీ నిర్మాణానికి సంబంధించిన అంశాలను సంబంధిత రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జేసీశుభం బన్సల్, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, పబ్లిక్ హెల్త్ ఈఈ సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

కేసు నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలి

ఎస్పీ సుబ్బరాయుడు



కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష చేస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏదైనా ఘటనలు జరిగినప్పుడు కేసు నమోదు చేసి ముద్దాయిలను అరెస్టు చేస్తే సరిపోదని, ఆ కేసులో సాక్షులను న్యాయం స్థానం ఎదుట హాజరుపరచి కేసు నిరూపణ చేసి నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందని ఎస్పీ సుబ్బరాయుడు అన్నారు. పోలీసు పెరేడ్ మైదానంలో శనివారం కోర్టు కానిస్టేబుళ్లు, మానటరింగ్ సిబ్బందితో పెండింగ్ కేసుల స్థితిగతులపై సమీక్ష చేశారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులోనూ నిరూపణ చేయుటకు చిత్తశుద్ధితో పనిచేసి బాధితులకు న్యాయం చేయాల్సిన బాధ్యత కోర్టు కానిస్టేబుళ్లపై ఉందన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, సీఐలు, కోర్టు లైజన్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, మానటరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో వికలాంగుడైన సచివాలయ ఉద్యోగి సాయికుమార్‌పై దాడికి పాల్పడిన కౌన్సిలర్ శేఖర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. శనివారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులపై దాడికి పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

కపిలేశ్వరస్వామి ఆలయంలో 4 నుంచి కార్తీక మాసోత్సవాలు

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో నవంబరు నాలుగవ తేదీ నుంచి కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి రోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నవంబరు 4, 11, 18, 25 తేదీలలో వేకువ జామున 2 గంటలకు సుప్రభాతం, అభిషేకం నిర్వహిస్తారు. ఈ కారణంగా ఆలయంలో భక్తులకు దర్శనం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు అనుమతిస్తారని తెలిపారు. రోజూ వేకువన 2.30 గంటల నుంచి 4.30 గంటల వరకు అభిషేకము, సహస్రనామార్చన జరుగుతుంది. అలాగే డిసెంబరు 1 వ తేదీన మధ్యాహ్నం 12 గంటల నుండి 1 గంటల వరకు స్వామి వారికి అభిషేకం (త్రిశూలస్నానం) జరుగుతుంది. రోజూ రాత్రి 6 నుండి 7 గంటల మధ్య లక్షదీపారాధన, పంచమూర్తి ఆరాధన జరుగుతాయి. అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను నగర వీధుల్లో ఊరేగిస్తారు.

పోలీసుల అదుపులో నలుగురు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) :తిరుపతి రూరల్ మండలం ఓటేరు, మల్లంగుంటలో యువకుల ఆగడాలపై ఆంధ్రజ్యోతిలో అమ్మో... గంజాయి శీర్షికన శనివారం ప్రచురితమైన వార్తాకథనంపై ఎస్పీ సుబ్బరాయుడు స్పందించారు.ఆయన ఆదేశాలతో ఎంఆర్‌పల్లి సీఐ చిన్నగోవిందు, ఎస్‌ఐ, టాస్క్‌ఫోర్సు బృందాలు ఉదయం ఆయా ప్రాంతాలకు సిబ్బందిని పంపి గంజాయి బ్యాచ్ ఆగడాలపై ఆరా తీశారు.గంజాయి బ్యాచ్ ఆగడాలకు భయపడి కొన్ని కుటుంబాలు బెంగళూరుకు వలస వెళ్లడంపై వివరాలు సేకరించారు.శ్రీవారినగర్‌లో రిటైర్డు ఎస్‌ఐ వెంకట్రామరాజు, టీటీడీ రిటైర్డు ఉద్యోగి ధర్మేంద్ర లను బెదిరించడంపై ఆరా తీశారు.ఇంటిముందు రోడ్డుపై వాకింగ్ చేస్తున్న ధర్మేంద్రపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని పోలీసులకు స్థానిక ప్రజలు వివరించారు.అనంతరం నలుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా మద్యం మత్తులోనే రిటైర్డ్ ఎస్‌ఐ వెంకట్రామరాజు, టీటీడీ రిటైర్డు ఉద్యోగి ధర్మేంద్రలపై దాడి జరిగిందని రూరల్ సీఐ ఒక ప్రకటనలో తెలిపారు.నిందితులు గంజాయి సేవించలేదని, ఆల్కహాల్ మత్తులోనే దాడికి పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని తెలిపారు.

కోడి పందేల స్థావరంపై దాడి - నలుగురి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని పైడిపల్లి గ్రామ పరిసరాల్లో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరంపై శనివారం దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి, రూ.26,700, ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చిన్నగోవిందు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడిచేసి కోడి పందేలు ఆడుతున్న పైడిపల్లికి చెందిన కోళ్లగుంట రాజు, కటారి చలపతి, గాలి ఉమామహేష్, శ్రీహరిని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి (ఆటోనగర్), అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తిరుపతి టౌన్ ఈఈ వి.చంద్రశేఖర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బాలాజీ కాలనీ, ఎస్‌ఎస్ రిజర్వాయర్ కాలనీ, గిరిపురం, ఎల్‌బిసీ రోడ్డు, ఇందిరానగర్, నెహ్రూనగర్, ప్రకాశంరోడ్డు, వేశాలమ్మగుడి వీధి, కుమ్మరతోపు, పాలిటెక్నిక్ కళాశాల, వరదరాజనగర్, కేబీ లేఅవుట్, సింగాలగుంట, ఆర్ఎస్ గార్డెన్, మంచాల వీధి, గాలివీధి, టి.నగర్, కాళికమ్మగుడి, ఇర్లానగర్, అలిపిరి, చెన్నారెడ్డికాలనీ, అంబేద్కర్‌కాలనీ, హౌసింగ్ బోర్డుకాలనీ, మారుతినగర్, రామనగర్ క్వార్టర్స్ రుయా, స్విమ్స్ ఆస్పత్రులు, మెడికల్ కళాశాల, మెటర్నటీ ఆస్పత్రి, వేదిక్ యూనివర్సిటీ, సైన్స్ సెంటర్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఈఈ తెలిపారు.

పనిభారం తగ్గించండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రిలో 4వ తరగతి ఉద్యోగులపై తీవ్రమైన పనిభారం ఉందని, దానిని తగ్గించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను రుయా ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శనివారం వారు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దీనిపై రుయా యాజమాన్యానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ కోర్టులో వ్యాజ్యం కారణంగా ఈ పరిస్థితి ఎదురైందని, నవంబరు నాటికి కొత్త రిక్రూట్‌మెంట్ పూర్తి చేసి పనిభారం తగ్గిస్తామని హామీ ఇచ్చారు. దీంతో యూనియన్ నేతలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మునిచంద్ర, నరసింహులు, గురవయ్య, కాంచనమాల, హరికుమార్, రాధా, కుమారిదేవి, రమేష్, మునివెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

117 జీవో రద్దు నిర్ణయం హర్షణీయం: ఆపస్

తిరుపతి విద్యఅక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని అన్నివిధాల నిర్వీర్యం చేసిన 117 జీవోను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని ఆపస్ రాష్ట్ర అధ్యక్షులు బాలాజీ పేర్కొన్నారు. 117 జీవోను రద్దుచేసి ప్రత్యామ్నాయంగా తీసుకోవాల్సిన చర్యలను తెలుసుకునేందుకు ఓ కమిటీ వేయడాన్ని తాము ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల విద్యావిధానాలను పరీక్షించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని ఏర్పాటుచేసి వారి విన్నపాలను కూడా తెలుసుకుని చర్యలకు ఉపక్రమించడం అభినందనీయమంటూ ఆనందం వ్యక్తం చేశారు.

యథాస్థానంలో మురుగుకాలువ



పాత కాలువను తవ్వుతున్న జేసీబీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి అర్బన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతి గ్రామీణ మండలం మంగళంలోని ఆర్టీవో కార్యాలయానికి ఎదురుగా ధోబీఘాట్, శ్మశాన మార్గంలో ప్రవహిస్తున్న మురుగునీరు మునుపటి కాలువలోనే పారేలా చర్యలు చేపట్టారు. శనివారం ఆంధ్రజ్యోతిలో 'రోడ్డుపై మురుగునీటి ప్రవాహం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హేమాద్రి, సప్తగిరికాలనీ ఉపసర్పంచ్ అశోక్‌రెడ్డి ఉదయాన్నే ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. వెంటనే జేసీబీతో పూడికలను తొలగించి భూమిలోకి ఉన్న కాలువను బయటపెట్టారు. కాస్త తొలగించగానే మురుగునీరు కాలువలోకి ప్రవేశించాయి. ఇకపై పరిధి దాటి ఎలాంటి పూడికలు, తవ్వకాలు చేయకూడదని ఇంటి యజమానిని హెచ్చరించారు.

పొలం బాట



వాకాడు మండలం నిడిగుర్తి సమీపంలోని పొలాల్లోకి ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. వాకాడు డిపోకు చెందిన బస్సు శనివారం మధ్యాహ్నం మల్లాం నుంచి మూల పడవ గ్రామానికి బయలుదేరింది. నిడిగుర్తి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. అప్పటివరకు ప్రశాంతంగా ఉన్న ప్రయాణికులు ఉలికి పాటుకు గురయ్యారు. అయితే ఎవరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే బస్సు అదుపు తప్పిందని ప్రయాణికులు తెలిపారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ఎరక్కపోయి వచ్చాను..ఇరుక్కుపోయాను



నాయుడుపేట మండలంలోని మేనకూరు సెజ్‌కు వెళ్లే రహదారిలో కల్వర్టుకు భారీ గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతు చేసే క్రమంలో పరిమితికి మించి కల్వర్టు ఎత్తు పెంచారు. దీంతో సెజ్‌లోకి వచ్చే భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. పైగా వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. ఈ క్రమంలో శనివారం ఒక భారీ వాహనం ఆ ప్రాంతంలో ఇరుక్కుపోయింది. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గంటల తరబడి వాహనదారులు, ప్రయాణికులు రోడ్డుపై వేచి ఉండాల్సి వచ్చింది.

- నాయుడుపేట, ఆంధ్రజ్యోతి

జగనన్న కాలనీ జలమయం

శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ఉన్న జగనన్న కాలనీ శనివారం జలమయమైంది. వేకువజామున 4 నుంచి 5 గంటల వరకు కురిసిన వర్షానికి పనస కాలువ నుంచి నీరు పొంగి జగనన్న కాలనీ వైపు ప్రవహించాయి. కాలనీలోని ఇళ్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. అక్కడ నివాసముంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ దృశ్యాలను కొందరు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి





కొండ శిఖరంపై



తటాకాల్లో ఈదులాడుతూ





నీటి మడుగు అడుగున దేవతా మూర్తితో - జలపాతం కింద



ఇక్కడే నివాసం

వనవాసి

ఎక్కడ పుట్టాడో, ఎప్పుడు పుట్టాడో, తల్లిదండ్రులెవరో తెలీదు. ఎలా వచ్చాడోగానీ పసి వయసు నుంచీ తిరుమలలో కనిపిస్తున్నాడు. ప్రసాదాలు తింటాడు.. బండలమీద పడుకుంటాడు.. ఒంటిమీద ఇంత గుడ్డ చుట్టుకుంటాడు.. ఉత్సవాల సమయాల్లో దివిటీలు పట్టుకునేవాళ్ల పక్కన చేరి తనూ అందుకుంటాడు. మాడవీధుల్లో తిరుగుతాడు. పేరు జైబాలాజీ. ఆ పేరును ఆయనే పెట్టుకున్నాడు. ఇప్పుడతని వయసు 50 ఏళ్లు ఉండచ్చు. తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనం సమీపంలో కృష్ణతేజ విశ్రాంతి భవనం వెనుకవైపు దట్టమైన చెట్ల నడుమ అతని నివాసం. పేర్చిన బండరాళ్ల మీద రేకు పైకప్పు. కరెంటుతో పనిలేదు. వంట లేదు. శ్రీనివాసుడి ఆరాధన తప్ప మరో ధ్యాస లేదు. చెట్టూ పుట్టా, పిట్టా పురుగూ, వాగూ వంకా.. తిరుమల అడవుల్లో ఆయనకు తెలియనివేవీ లేవు. భవిష్యత్తు గురించిన బెంగలేదు.. భయం అంటే ఏమిటో తెలీదు.. ఈ శేషాచలజీవికి. అడవిలో ఉంటే కాయాగసరూ తింటాడు. తిరుమలలో ఉంటే అన్నప్రసాదాలు తింటాడు. జైబాలాజీకి తెలియని తీర్థం, ఆయన ఎక్కని శిఖరం, దిగి తిరగని లోయ.. తిరుమల కొండల్లో లేవు. తిరుమల తీర్థాలకు ట్రెక్కింగ్ వెళ్లే బృందాలకు తోవ చూపుతాడు. వాళ్లతో కలిసి నడుస్తాడు. జలపాతాల కింద తడుస్తాడు. ఎత్తయిన బండలమీద నుంచి తటాకాల లోతుల్లోకి దూకి ఈదులాడుతాడు. తీర్థాల విశేషాలను వివరిస్తాడు. పిల్లనగ్రోవి ఊదుతూ ఏ పచ్చని చెట్టు కిందో ఉండిపోతాడు. తిరుమల అడవుల ఆనుపానులు తెలిసిన జైబాలాజీ కొంతకాలంగా యూట్యూబ్‌లో సందడి చేస్తున్నాడు. అడవిలో ఆయన జీవనశైలిని చిత్రించి కొందరు వీడియోలు అప్‌లోడ్ చేస్తున్నారు. యూట్యూబ్ స్టార్‌గా మారిపోయిన ఈ అడవిబిడ్డ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కుకు 'అధికార' చిక్కులు

- అధినేత హెచ్చరించినా దారికి రాని 'తమ్ముళ్లు'
- జిల్లాలో పలుచోట్ల షాపులు పెట్టనివ్వని వైనం
- లక్కులో దక్కినా తలపట్టుకుంటున్న యజమానులు

తిరుపతి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపుల విషయంలో జోక్యం చేసుకుని చెడ్డపేరు తేవద్దంటూ సీఎం చంద్రబాబు గట్టిగా వార్నింగ్ ఇచ్చినా జిల్లాలో కొన్నిచోట్ల కొందరు కూటమి నాయకుల తీరు మారినట్లు కనిపించడంలేదు. ఆయన హెచ్చరిక జారీ చేసి 24 గంటలు తిరక్కుండానే కొందరు తెలుగు తమ్ముళ్లు గాలికొదిలేసి తమదైన పెత్తనం ప్రదర్శిస్తున్నారు. అంతా తమ కనుసన్నల్లో జరగాల్సిందేనంటున్న వైనాలు జిల్లాలో బయటపడుతూనే ఉన్నాయి.

- ఏర్పేడు మండలానికి చెందిన 82వ నంబరు మద్యం షాపును పంగూరుకు చెందిన కిరణ్ కుమార్‌నాయుడుకు లాటరీలో దక్కింది. ఏ పార్టీకీ చెందని ఇతడు ఆమందూరు పంచాయతీ పరిధిలో ఏర్పేడు-వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన ఓ గది అద్దెకు తీసుకున్నారు. శనివారం మద్యం స్టాక్ తెచ్చుకున్నారు. అధికార పార్టీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధి, పార్టీ నాయకుడు తమ అనుచరులతో కలసి ఇతడ్ని అడ్డుకున్నారు. గంటపాటు గొడవ జరిగింది. నిస్సహాయుడైన యజమాని షాపు తెరవలేక మద్యం స్టాక్‌ను వెనక్కు తీసుకెళ్ళిపోయాడు. షాపు ఏర్పాటు వల్ల మహిళలకు, విద్యార్థినులకు ఇబ్బంది అంటూ ఈ నాయకులు పైకి చెబుతున్నా అడ్డుకున్న స్థానిక ప్రజాప్రతినిధి మద్యం సిండికేట్ కీలక సభ్యుడని సమాచారం. మండల కేంద్రంలో షాపు ఏర్పాటు యత్నాల్లో ఉన్న తనకు ఆమందూరు పరిధిలో షాపు పెడితే వ్యాపారం తగ్గుతుందనే అడ్డుపడ్డారని తెలిసింది



ఏర్పేడులో షాపును స్థానికులు అడ్డుకోవడంతో మద్యం బాక్సులను వాహనంలో తరలిస్తున్న నిర్వాహకుడు

ఐదు షాపులు పెండింగ్

తిరుపతి రూరల్ మండలంలో 12 షాపులు కేటాయించగా ఇంకా ఏడు ఏర్పాటు కాలేదు. తిరుచానూరు సమీపంలో స్థానిక ప్రజాప్రతినిధి సోదరుడికి లాటరీలో రెండు షాపులు వచ్చాయి. వాటిని ఇచ్చేయాలంటూ కూటమి పార్టీల నేతలు, మద్యం సిండికేట్ సభ్యులు అతడిపై ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. తాము ఇచ్చినంత తీసుకుని వదిలిపెట్టేయాలని డిమాండ్ చేశారు. వినకపోవడంతో అతడి సోదరుడు, స్థానిక ప్రజాప్రతినిధి గతంలో ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటామని బెదిరించారు. ఆ దిశగా చర్యలకు కూడా దిగడంతో గత్యంతరం లేక రెండు షాపులూ సిండికేట్‌కే అప్పగించినట్టు సమాచారం.

బాలాయపల్లిలోనూ అదే పరిస్థితి

బాలాయపల్లిలో మద్యం షాపు దక్కించుకున్న వ్యక్తి పరిస్థితి కూడా డక్కిలి వ్యక్తి తరహాలోనే ఉందని టీడీపీ వర్గాల్లోనే ప్రచారమవుతోంది. షాపు తమకే ఇచ్చేయాలని అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు భీష్మించుకోవడంతో ఇంతవరకూ లైసెన్సుదారు షాపు ఏర్పాటు చేయలేదని భోగట్టా..

గూడూరులో సెటిల్‌మెంట్!

గూడూరు పట్టణానికి ప్రభుత్వం పది షాపులు కేటాయించింది.అందులో ఇప్పటి వరకూ రెండు మాత్రమే ఏర్పాటయ్యాయి. ఎనిమిది పెండింగులో వున్నాయి. ఏ షాపులో ఎవరెవరికి ఎంతెంత వాటాలు ఇవ్వాలనేది అక్కడి ముఖ్యనేత వద్ద ప్రస్తుతం సెటిల్‌మెంట్ నడుస్తోందని సమాచారం.

డక్కిలి షాపులో వాటాకు పట్టు

డక్కిలి మండల కేంద్రంలో రెండు షాపులుండగా ఒకటి రాజకీయాలకు సంబంధం లేని తటస్థ వ్యక్తికి దక్కింది. అతను షాపు ఏర్పాటు ప్రయత్నాల్లో ఉండగా అధికార పార్టీ నేతలిద్దరు షాపును తమకు ఇచ్చేయాలని పట్టుబట్టారు. యజమాని ఎదురు ప్రశ్నించడంతో పంచాయతీ ముఖ్యనేత వద్దకు వెళ్ళిందని తెలిసింది. తమ వాళ్ళు గత ఐదేళ్ళలో బాగా నష్టపోయారని, కాబట్టి వారికి 40 శాతం వాటా ఇవ్వాలని పంచాయతీలో తేల్చి చెప్పారని సమాచారం. దీంతో షాపు యజమాని మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలిసింది.

రేణిగుంటలో నేతల జోరు

రేణిగుంట మండలంలోని పది షాపుల్లో ఆరు లాటరీలో టీడీపీ అనుకూలురు దక్కించుకున్నారు. మిగిలిన నాలుగు షాపులూ వైసీపీ అనుకూలురకు దక్కాయి. ఆ నాలుగూ ఇంతవరకూ ప్రారంభం కాలేదు. వాటిని ఏర్పాటు చేయకుండా ముఖ్యనేత పేరు చెప్పి అనుచరులు అడ్డుకుంటున్నారని తెలిసింది. షాపులు ఎలా నడుపుతారో చూస్తామంటూ బెదిరిస్తున్నట్లు సమాచారం.

ప్రారంభం కానిది 11 షాపులే

జిల్లాలో ఇప్పటి వరకూ 11 మద్యం దుకాణాలు మాత్రమే ప్రారంభం కాలేదని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. అధికార పార్టీ నేతలు గానీ సిండికేట్ పేరిట ఇతరులు గానీ లైసెన్సుదారులను అడ్డుకుంటున్నట్టు, బెదిరిస్తున్నట్టు తమ దృష్టికి రాలేదని చెబుతున్నారు. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్,చంద్రగిరి, శ్రీకాళహస్తిలలో మాత్రమే 11షాపులు ఏర్పాటు కావాల్సి ఉందంటున్నారు. అవి త్వరలోనే ప్రారంభమవుతాయంటున్నారు.





ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఆర్డీవో కిరణ్మయి - చికిత్స పొందుతున్న కార్మికులు

ఆటోను ఢీకొన్న లారీ

- డ్రైవర్ మృతి
- ఏడుగురు కార్మికులకు గాయాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారి కండ్రిగ వద్ద జాతీయ రహదారిపై శనివారం ఆటోను లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఉల్లా మునిరాజా(33) మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురి కార్మికులకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... దొరవారిసత్రం మండలం ఏకొల్లు, పూలతోట గ్రామాల నుంచి తడ మండలం మాంబట్టు పారిశ్రామికవాడలో ఉన్న ఓ పరిశ్రమలో పనిచేసే పది మంది కార్మికులు శనివారం విధులకు హాజరయ్యేందుకు ఆటోలో బయలుదేరారు. సూళ్లూరుపేట మండలం నాదెండ్లవారికండ్రిగ వద్ద వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మునిరాజా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఏకొల్లుకు చెందిన షకీనా, నీరజ, నిర్మల, ఈశ్వరి, పి.ఉదయ భాస్కర్, నేలపట్టుకు చెందిన పి.దేవి, విజయలక్ష్మీకి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన కార్మికులను 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఆర్డీవో కిరణ్మయి ప్రభుత్వాస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకొన్నారు. ఆటో డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, శ్రీసిటీ, మాంబట్టు పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల్లో మహిళలు అధిక సంఖ్యలో పనిచేస్తున్నారు. కంపెనీలు బస్సు సౌకర్యం కల్పించకపోవడంతో కార్మికులు ఆటోల్లో వెళ్లి రావాల్సి వస్తోంది. ఈ విషయాన్ని క్షతగాత్రులు ఆర్డీవో కిరణ్మయి దృష్టి తీసుకెళ్లారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేలా చూస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.



మృతి చెందిన మునిరాజా(ఫైల్‌ఫొటో)

నాలుగు రోజుల్లో రూ.49.38 కోట్ల మద్యం విక్రయాలు

తిరుపతి(నేరవిభాగం) అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాలుగు రోజుల్లో రూ.49.38కోట్ల విక్రయాలు జరిగాయి. 227 దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయగా ఇప్పటివరకు 218 ప్రారంభమయ్యాయి. ఇందులో తిరుపతి డివిజన్ పరిధిలో 125, గూడూరు డివిజన్ పరిధిలోని 93ఉన్నాయి. శనివారం వరకు 16,890 కేసుల బీర్లు, 9,179 కేసుల లిక్కర్ అమ్మకాలు జరిగాయి. తద్వారా ప్రభుత్వానికి రూ.49.38 కోట్ల ఆదాయం సమకూరింది. కాగా, తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తిలోని మద్యం దుకాణాలు సమయపాలన పాటించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఎమ్మార్పీకి విక్రయించకపోయినా, సమయపాలన పాటించకపోయినా చర్యలు తప్పవని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదం కేసులో నిందితుడి పేరే మార్చారు

ఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

తిరుపతి(నేరవిభాగం),అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):పది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు చేయడంలో అలసత్వం ప్రదర్శించడం, ముద్దాయి పేరును తారుమారు చేసి బాధితులకు న్యాయం చేయడంలో విఫలమైన పాకాల ఎస్‌ఐ మహేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ కం రైటర్ మొగిలీశ్వర రెడ్డి సస్పెండయ్యారు. తిరుపతిలో కాపురమున్న బాలశివరాం చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరులో విద్యుత్ శాఖ లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు.ఈ నెల 6న ద్విచక్ర వాహనంపై కల్లూరుకు వెళుతుండగా మార్గమధ్యంలోని పాకాల మండలం ఇ.పాలగుట్టపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో బాలశివరాం కాలికి బలమైన గాయమవడంతో పాకాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.చికిత్స నిమిత్తం తిరుపతిలో చేరాడు. అయితే సీఐ మద్దయాచ్చారి ఆదేశాలతో ఎస్‌ఐ మహేష్‌బాబు కేసు దర్యాప్తు చేసి నమోదు చేయడంలో తీవ్ర జాప్యం చేశాడు.దీనిపై బాధితుడు ఎస్పీ సుబ్బరాయుడిని కలసి ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదం 6వ తేది జరిగితే కేసు 16న నమోదు చేయడం, కారు డ్రైవరు చరణ్‌చౌదరిగా ఫిర్యాదులో పేర్కొంటే చంద్రగా నమోదు చేసినట్లు విచారణలో తేలింది. దీంతో శనివారం ఎస్‌ఐ మహేష్‌బాబును, హెడ్ కానిస్టేబుల్ మొగిలీశ్వర రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసుల నమోదులో తాత్సారం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమన్నారు.

స్కూల్‌వ్యాన్ బోల్తా.. పిల్లలు క్షేమం



కేవీబీపురం, అక్టోబరు 19(ఆంధ్ర జ్యోతి): స్కూల్ వ్యాను అదుపుతప్పి బోల్తాపడింది. అయితే పిల్లలందరూ సురక్షితంగా బయటపడ్డారు.కేవీబీపురంలోని ఓ ప్రైవేటు స్కూల్ వ్యాను శనివారం సాయంత్రం విద్యార్థులను ఇంటివద్ద దించడానికి కొండల్లో ఆదవరానికి బయలుదేరింది. ఎస్ఎల్‌పురం వద్ద ఎదురుగా కారు రావడంతో డ్రైవర్ వ్యాన్‌ను కాస్త పక్కకు తిప్పారు. దీంతో వ్యాను మట్టిలో దిగి పక్కకు ఒరిగిపోయింది. వ్యానులో ఏడుగురు పిల్లలు ఉన్నారు. వ్యాను ఒరుగుతుండగానే అందరూ దిగేశారు.

15మండలాల్లో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15మండలాల్లో శనివారం మోస్తరు వర్షం కురిసింది. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన అల్పపీడనంతో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసిన విషయం విదితమే. తిరిగి శనివారం వేకువజామున గంటపాటు మోస్తరు వర్షం కురిసింది.





గగనాన వెన్నెల కాంతులతో మబ్బులు దోబూచులాడుతున్న దృశ్యాలు శనివారం రాత్రి తిరుపతి నగర ప్రజలకు కనువిందు చేశాయి. అనందానుభూతులను పంచాయి. రాత్రి 9 గంటల వేళ తిరుపతి లీలామహల్ సెంటర్‌లోని శ్రీనివాస సేతు నుంచి ఈ నయన మనోహర దృశ్యాలను ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

సూళ్లూరుపేటలో భారీ వర్షం



రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపునీరు

సూళ్లూరుపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం భారీ కురిసింది. తుపాన్ ప్రభావంతో నాలుగు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు జలకళ రావడమే కాకుండా కాళంగి నది, నెర్రికాలువకు భారీగా నీరు చేసింది. రెండు విరామం అనంతరం మళ్లీ శనివారం తెల్లజామున 4నుంచి 6 గంటల వరకు భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం కూడా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారడమే కాకుండా గాండ్లవీధి, రైల్వేస్టేషన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపు నీరు నిలబడడంతో వాహనదారులు, పాదచారులకు అవస్థలు తప్పలేదు.

గూడూరులో జోరు వాన

గూడూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం ఉదయం రెండుగంటల పాటు జోరుగా వర్షం కురిసింది. ఉదయం ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా రెండు గంటల పాటు పడింది. దీంతో పట్టణంలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధానంగా ఆర్టీసీ బస్టాండు రోడ్డు, త్యాగరాజవీధి, ఆస్పత్రి రోడ్లపై వర్షపునీరు చేరడంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

వర్షాలతో పంట నష్టం లేదు

తడ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాల వల్ల ఎక్కడా పంటనష్టం జరగలేదని ఏవో కాంచన తెలిపారు. శనివారం ఇరకందీవిలో ముంపునకు గురైన వరిపైరును పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు కొన్నిచోట్ల వరి నార్లు మాత్రం దెబ్బతిన్నాయన్నారు. అంతకు మించి ఎటువంటి నష్టం జరగలేదన్నారు. ఈ వర్షం ఎడగారి పైరుకు ఉపయోగపడిందని ఏవో అన్నారు.

ఉచితంగా డీఎస్సీ శిక్షణ

వెంకటగిరి టౌన్, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని సాంఘిక సంక్షేమాధికారిణి ఎం.లక్ష్మీరాజ్యం శనివారం తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బత్తలాపురంలో గ్రామసభ

ఓజిలి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం బత్తలాపురంలో శనివారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. గ్రామస్తులు భూ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయ కుమార్, సర్వేయరు లక్ష్మీనారాయణ, వీఆర్వో మస్తానయ్య, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దువ్వూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

జీఎన్‌టీ రోడ్డుకు మరమ్మతులు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఆర్అండ్‌బీ అధికారులు పట్టణంలో జీఎన్‌టీ రోడ్డుకు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నారు. పట్టణ ముఖద్వారం హోలిక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు జీఎన్‌టీ రోడ్డులో గోతులు పడి అధ్వానంగా ఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ రోడ్డులో తట్టెడు మట్టి కూడా వేయకపోవంతో గుంతలమయంగా మారింది. శనివారం హోలిక్రాస్ సర్కిల్ నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

తీరప్రాంత గ్రామాలకు

తారురోడ్డు కలేనా!

- అధ్వానంగా కొరిడి - పేర్నాడు దారి
- అటవీశాఖ అభ్యంతరాలతో అవరోధాలు
- మూడు పంచాయతీల ప్రజలకు నరకం





అధ్వానంగా ఉన్న కొరిడి - పేర్నాడు దారి, వర్షానికి కోతకు గురైన రోడ్డు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిడి - పేర్నాడు దారిని తారు రోడ్డు మార్చేందుకు పర్యావరణ చట్టం ప్రతిబంధకంగా మారుతోంది. అటవీశాఖ అభ్యంతరాలతో తీరప్రాంత గ్రామాల ప్రజలకు తారు రోడ్డు కలగానే మిగిలిపోయింది. మండలంలో కొరిడి, దామరాయి, కడపత్ర పంచాయతీల పరిధిలో 23 గ్రామాలున్నాయి. ఈ గ్రామాల ప్రజలంతా ఏ చిన్న పనికైనా సూళ్లూరుపేటకు రావాల్సిందే. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలోని అట్టకానితిప్ప నుంచి పులికాట్ సరస్సు మీదుగా కొరిడి, దామరాయి, కడపత్ర పంచాయతీలకు వెళ్లాలి. సూళ్లూరుపేట నుంచి అట్టకానితిప్ప వరకు తారురోడ్డు ఉండగా, అక్కడ నుంచి కొరిడి, దామరాయి మీదుగా కడపత్ర పంచాయతీలోని పేర్నాడు వరకు 9 కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు ఉంది. ఈదారి పులికాట్ సరస్సు పరిధిలో ఉండడంతో రోడ్డు వేయాలంటే అటవీశాఖ అనుమతి తప్పనిసరి. పర్యావరణానికి భంగం కలుగుతుందని అటవీశాఖ చెబుతుండడంతో తారు రోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేసినా నెరవేరడం లేదు. చిన్నపాటి వర్షమొచ్చినా గ్రావెల్ రోడ్డు కోతకు గురవుతోంది. దారి మొత్తం గోతులు పడి వాహనాలు వెళ్లలేని ఎదురవుతోంది. గత ఏడాది డిసెంబరులో మిచౌంగ్ తుఫాను ప్రభావానికి రోడ్డు దాదాపు రెండు కిలోమీటర్ల పైబడి కోతకు గురైంది. ఆర్టీసీ అధికారులు అప్పట్లో రెండు వారాల పాటు బస్సు సర్వీసును రద్దు చేశారు. మూడు రోజుల క్రితం తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షానికి రోడ్డుపై పెద్దగుంత ఏర్పడింది. గ్రామస్తులే స్పందించి రాళ్ల, ఇసుక బస్తాలతో పూడ్చిపెట్టారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులు కూడా చేయక పోవడంతో రోడ్డు మొత్తం గుంతమయంగా మారింది. అనేకసార్లు పులికాట్ సరస్సులోకి బస్సు దూసుకెళ్లి ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయి. రోడ్డు బాగలేకపోవడంతో మూడు పంచాయతీల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని కొరిడి - పేర్నాడు దారిని తారురోడ్డు మార్చాలని తీరప్రాంత గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అభయ వెంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా నగలు, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పలు హారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పిడిగు పాటుతో గృహోపకరణాల దగ్ధం

బాలాయపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టికాడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సుబ్రమణ్యం ఇంటిపై పిడుగు పడింది. దీంతో టీవీ, ఫ్రిడ్జ్, వాషింగ్ మిషన్, ఏసీ కాలిపోయాయి.

రేపు హుండీ లెక్కింపు

సూళ్లూరుపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ ఆలయ హుండీ లెక్కింపు సోమవారం జరుగుతుందని దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు.

శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజను చేశారు. అభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని పలు పుష్పాలతో విశేషంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పిచారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించండి

కేవీబీపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి గ్రామస్తులందరూ సహకరించాలని టీడీపీ మండల అధ్యక్షులు రామాం జులనాయుడు చెప్పారు. శనివారం మండలంలోని ఆరె, మిద్దికండ్రిగ, బంగారమ్మకండ్రిగ, సిద్ధినాయుడుకండ్రిగ, వగత్తూరు గ్రామాల్లో సిమెంటు రోడ్లకు భూమిపూజ చేశారు. రైతు పార్లమెంటరీ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, పురుషోత్తం, మధు, మాజీ సర్పంచ్ వెంకటేష్, గ్రామస్తులు, ఎంపీడీవో రాధారాణి, ఏపీవో కుమారస్వామి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అత్త, మామపై దాడి కేసులో నిందితుల అరెస్టు



నిందితులను మీడియాకు చూపుతున్న పోలీసులు

గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఇందిరానగర్‌లో ఈనెల 13వ తేదీ రాత్రి అత్త, మామపై దాడి చేసి గాయపరిచిన కేసులో అల్లుడితో పాటు నిందితులను అరెస్టు చేసినట్లు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరానగర్‌కు చెందిన చెంచు కృష్ణయ్య, ధనమ్మ తమ కుమార్తె మహాలక్ష్మికి గత కొన్నేళ్ల క్రితం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన సుబ్రహ్మణ్యంతో వివాహం జరిపించారు. చెంచుకృష్ణయ్య, అతని అల్లుడు సుబ్రహ్మణ్యం కలిసి పదేళ్ల క్రితం కందిపప్పు వ్యాపారం చేసేవారు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం బంధువు అయిన ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం గ్రామానికి చెందిన రమేష్‌కు మామ, అల్లుడు కలిసి రూ. 10లక్షలు అప్పుగా ఇచ్చారు. రమేష్ వ్యాపారంలో నష్టపోవడంతో బాకీ చెల్లించలేక బదులుగా తన గ్రామంలోని ఇంటిని సుబ్రహ్మణ్యంకు ఇచ్చేశాడు. ఆ ఇంటిని సుబ్రహ్మణ్యం తన మామ చెంచుకృష్ణయ్యకు తెలియకుండా అమ్ముకుని సొమ్ము చేసుకున్నాడు. నెల క్రితం ఈ విషయం తెలుసుకున్న చెంచుకృష్ణయ్య తన వాటా డబ్బులు ఇవ్వాలని అల్లుడిని అడగగా సుబ్రహ్మణ్యం నిరాకరించాడు. ఈ నగదు విషయమై మామ, అల్లుడుకి తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈనెల 10వ తేదీన చెంచు కృష్ణయ్య తన కుమార్తె ఇంటికి వెళ్లి తనకు రావాల్సిన నగదు ఇవ్వాలని ఆమెతో గొడవపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న సుబ్రహ్మణ్యం 13వ తేదీ రాత్రి మరో ఆరుగురు బంధువులతో కలిసి గూడూరుకు వచ్చారు. ఇందిరానగర్‌లోని అత్తా, మామలైన చెంచు కృష్ణయ్య, ధనలక్ష్మిపై ఇనుప రాడ్‌లతో దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారన్నారు. చెంచుకృష్ణయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌లోని పార్శిల్ కార్యాలయం వద్ద సుబ్రహ్మణ్యంతో పాటు అతని బంధువులైన విజయ్, భాస్కర్, సురేష్, రాజేష్, నరసింహను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మరో నిందితుడు మనోహర్ పరారీలో ఉన్నాడని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐలు గోపాల్, సుబ్రహ్మణ్యంరాజు, సిబ్బంది చిరంజీవులు, సురేష్, నాగేంద్ర, సతీష్, మధు, కృష్ణారావు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం జరగనివ్వను: కురుగొండ్ల



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

డక్కిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగనివ్వనని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ హామీ ఇచ్చారు. శనివారం ఆల్తూరుపాడు వెల్లంపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ హయాంలో రూ.400 కోట్లతో ఆల్తూరుపాడు గ్రామం వద్ద సోమశిల - స్వర్ణముఖి బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిర్మాణం చేపడితే వైసీపీ ప్రభుత్వం పనులను అర్ధాంతరంగా ఆపేసి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. రీటెండర్ ద్వారా 27 శాతం లెస్‌తో పనులు దక్కించుకొన్న కాంట్రాక్టర్ వైసీపీ నేతలకు ముడుపులు ఇచ్చుకోలేక పనులు ఆపేసి వెళ్లిపోయారని దుయ్యబట్టారు. మళ్లీ రిజర్వాయరు నిర్మాణం మొదలుపెట్టే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళితే ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆల్తూరుపాడు వెల్లంపల్లి గ్రామానికి చెందిన కొంతమంది రైతుల సాగు భూములకు పట్టాలు లేని కారణంగా నష్టపరిహారం చెల్లించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈ విషయమై కలెక్టర్‌తో చర్చించడం జరిగిందన్నారు. వీరందరికీ నష్ట పరిహారం చెల్లించాలా లేక మరో చోట భూములు కేటాయించాలా అన్న విషయాన్ని జిల్లా అధికారులు పరిశీలిస్తున్నారని, త్వరలోనే రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అంతకుమందు ఆల్తూరుపాడు వెల్లంపల్లి గ్రామంలో ట్రాక్టరు ప్రమాదంలో మృతి చెందిన చెందిన టీడీపీ కార్యకర్త వేమల మల్లికార్జున కుటుంబాన్ని ఎమ్మెల్యే రామకృష్ణ పరామర్శించారు. ఆయన వెంట వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాధనాయుడు, డక్కిలి చంద్రారెడ్డి, వేముల నాగభూషణం నాయుడు, మునిస్వామి రెడ్డి, శివ ప్రసాద్ తదితరులు వున్నారు.

కాళంగిలో చేరిన నీరు



కేవీబీపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి జలాశయంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఓ మోస్తరు నీరు చేరడంతో రైతులకు కొంత ఉరటనిచ్చింది. కాళంగి జలాశయం నీటిమట్టం 222 అడుగులు. ప్రస్తుతం జలాశయంలో 213 అడుగులకు చేరింది. దీంతో రైతులు నారుమళ్లు వేసుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆయకట్టు 4,645 ఎకరాలు ఉంది. ఇందులో కొంతభాగం బీఎన్‌కండ్రిగ మండలంలో ఉంది.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం: నెలవల



సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నెలవల దంపతులు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 19: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని భీమవరం బీసీ కాలనీలో రూ.5 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నేరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోను బాబు, తుపాకుల కన్నెమ్మ, గోపాలయ్య, నంచి రమేష్, ఆనాల రమేష్, గ్రామ కార్యదర్శి మల్లికార్జున్ పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లకు భూమిపూజ

నాయుడుపేట/బాలాయపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం గొట్టిప్రోలు పంచాయతీలో శనివారం పల్లె పండుగ కార్యక్రమాన్ని ఎంపీడీవో సురేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లకు భూమిపూజ చేశారు. కార్యక్ర మంలో గొట్టిప్రోలు ఎంపీటీసీ సభ్యుడు పల్లమాల రామిరెడ్డి, సర్పంచు పరసా వెంకటరమణయ్య, టీడీపీ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీవో షీల తదితరులు పాల్గొన్నారు. ● బాలాయపల్లి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. పెరిమిడిలో రూ.19 లక్షలు, భైరవరంలో రూ.10 లక్షలు, సంగవరంలో రూ.10 లక్షలు, నిడిగల్లులో రూ.10 లక్షలు, కాట్రగుంట రూ.8 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎంపీడీవో వినీల్‌కుమార్, సర్పంచులు చప్పిడి గాయత్రి, పూడేటి వనమ్మ, ఎంపీటీసీలు రత్నమ్మ, రామయ్య, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ మోహన్ రాజు, ఏపీవో మృత్యుంజయరావు, నాయకులు దాసరి రాజగోపాల్ నాయుడు, దాసరి ప్రభాకర్ నాయుడు, కూను శ్రీహరి, గుడి సురేష్, ఆది వెంకటకృష్ణారెడ్డి, దాసరి కోటేశ్వరావు, పులకంటి మురళి, మారెళ్ల వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకురాలికి డాక్టరేట్



వల్లీదేవి

కోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగ అధ్యాపకురాలు టి.వల్లీదేవికి డాక్టరేట్ లభించింది. అధునాతన మిషన్ నెర్లింగ్ టెక్నిక్ ద్వారా కనెక్ట్ చేయబడిన అటానమస్ వెహికల్స్‌లో సైబర్ సెక్యూరిటీని మెరుగుపరచడంపై సీఎస్ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ విజయభాస్కర్ ఆధ్వర్యంలో వల్లీదేవి పరిశోధనలు చేసి ఉత్తరప్రదేశ్‌లోని జేఎస్ యూనివర్శిటీకి పంపారు. ఉత్తమ పరిశోధనగా ఎంపికవడంతో జేఎస్ యూనివర్శిటీ వల్లీదేవికి డాక్టరేట్ ప్రదానం చేసింది. శనివారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమోంటోలతో వల్లీదేవిని అభినందించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటేష్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిట్టేడు, కోటలోని బీసీ బాలుర వసతి గృహాలను శనివారం తనిఖీ చేశారు. సిబ్బందికి సంబంధించిన హాజరుపట్టి, విద్యార్థులకు పెడుతున్న మెనూ, స్టాక్ వివరాలను పరిశీలించారు. వార్డెన్ గజేంద్రకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి అనూష

వెంకటగిరి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టాలపై విద్యార్థులు అవగాహన ఉండాలని వెంకటగిరి సివిల్ జడ్జి అనూష అన్నారు. శనివారం స్థానిక గురుకుల పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 1వ తేదీ నుంచి న్యాయ చట్టాలలో కేంద్ర ప్రభుత్వం మార్పులను తీసుకువచ్చిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం పాఠశాలలోని వంట గదిని పరిశీలించి మెనూ వివరాలతో పాటు భోజన నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు.

సచివాలయ ఉద్యోగిపై దాడి చేసిన కౌన్సిలర్‌ను కఠినంగా శిక్షించాలి

వెంకటగిరి, అక్టోబరు 19: అమ్మవారిపేట సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై ఈ నెల 18వ తేదీన దాడి చేసిన 5వ వార్డు కౌన్సిలర్ శేఖర్‌ను కఠినంగా శిక్షించాలని సచివాలయ ఉద్యోగ సంఘం నేతలు డిమాండ్ చేశారు. శనివారం సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యే రామకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ వార్డులోని కుళాయిల్లో నీళ్లు రావడం లేదన్న కారణంగా కౌన్సిలర్ నారి శేఖర్ ఫోన్‌లో ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయిని దుర్భాషలాడటమే కాకుండా కార్యాలయానికి వచ్చి దాడిచేసి గాయపరిచినట్లు తెలిపారు. ఆయనపై నాన్‌బెయిల్ కేసు నమోదు చేసి జైలుకు పంపాలని సచివాలయ ఉద్యోగ సంఘం నేతలు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు కృష్ణారెడ్డి, సుబ్బరాయుడు, వెంకటసాయి, నాగరాజు, అశోకన్, శ్రీహరి, సత్యవేణి, మునీర్, సుబ్బరాయులు, సుధ, సాయి తరదితరులు పాల్గొన్నారు.

అక్రమణదారుడిపై చర్యలు తీసుకోండి

గూడూరు అర్బన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని అక్రమించిన వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకుడు శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చెన్నూరు కటాలమ్మగుడి సమీపంలో బస్టాండు పక్కనే ఉన్న ఆర్అండ్‌బీ ప్రభుత్వ స్థలాన్ని చెన్నూరు గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమంచి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నాడని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

యూరియా పంపిణీ

గూడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు రైతుసేవా కేంద్రం వద్ద శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, హేమకుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

నాయుడుపేట టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు గీతావాణి తెలిపారు. శనివారం మండలంలోని చిగురుపాడులో గ్రామసభ నిర్వహించారు. రీసర్వేలో ఏమైన సమస్యలు ఉంటే రైతులు గ్రామసభలో ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని చెప్పారు.

రెవెన్యూ తప్పులకు రైతులను బలిచేయొద్దు

పెళ్లకూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో చేపట్టిన రీ సర్వేలో రెవెన్యూ యంత్రాంగం చేసిన తప్పులకు రైతులను బలి చేయవద్దని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ అన్నారు. శనివారం జీలపాటూరులో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ అధికారులు చేసిన తప్పులను సచివాలయం, మీ సేవలో దరఖాస్తు చేసుకుని చలానాలు కడితే పరిష్కరిస్తామనడం సబబు కాదన్నారు. రైతుల నుంచి వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అనంతరం రైతుల నుంచి భూ సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. ఆర్ఐ సంతోషిభాయి, మండల సర్వేయర్ పూజిత, గ్రామ సర్వేయర్ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు మృతి టీడీపీకి తీరని లోటు

చిట్టమూరు, అక్టోబర్ 19(ఆంధజ్యోతి): చిట్టమూరు గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శి బందిలి శ్రీనివాసులు(35) మృతి తీరని లోటని ఆ పార్టీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు విచారం వ్యక్తం చేశారు. శ్రీనివాసులు శుక్రవారం మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహానికి టీడీపీ నాయకులు నివాళులర్పించారు. కిషోర్ నాయుడు, బాబునాయుడు, కార్యకర్తలతో కలసి పాడె మోసారు.

వర్షాలతో నిండుతున్న చెరువులు



నిండిన నీర్పాకోట చెరువు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువులు జళకళ సంతరించు కుంటున్నాయి. దీనికి తోడుగా తెలుగుగంగ నీరు చెన్నైకు పోతుడటంతో ఈ నీరు కూడా చెరువులకు చేరుకోవడంతో నీర్పాకోట, కాంపాళెం, చిన్నపాలేడు, కుక్కంబాకం కారణి, తలారివెట్టు, కల్లివెట్టు చెరువులు నిండాయి. మండలానికి ఉత్తర భాగంలో ఉన్న చెరువులలో వర్షాలతో నిండుతున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సమాయత్తమవు తున్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ



నారాయణవనం, అక్టోబరు 19: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ ను నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. ఆలయాధికారులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వజీవుల సేవయే సర్వేంద్రుని సేవ



సమావేశంలో మాట్లాడుతున రమేష్ బాబు

పుత్తూరు టౌన్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి): సర్వజీవులు సేవయే సర్వేంద్రుని సేవ అని తెలుగు విభాగానికి చెందిన రీసెర్చ్ స్కాలర్ రమేష్ బాబు తెలిపారు. పుత్తూరులో విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశాన్ని శనివారం బాస్కర్‌రాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రమేష్ బాబు మాట్లాడుతూ వృద్ధాప్యం అంటే ఆప్యాయతలను పంచేదని గుర్తుచేశారు. సేవా పరమార్ధం అనే అంశంపై వివరించారు. విశ్రాంత ఉద్యోగుల భవన నిర్మాణానికి మునిరాజుల శెట్టి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రూ.50 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహిత్య పిపాసి ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, గౌరవ అధ్యక్షులు గుణశేఖర్ రెడ్డి, జిల్లా బాధ్యులు కృపావరమ్మ, యుగంధర్‌రాజు, సంఘం సభ్యులు కుప్పయ్య రామలింగం, రామూర్తి, చంద్రశేఖర్ వర్మ, వెంకటకృష్ణమనాయుడు, చిరంజీవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



బండారుపల్లిలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్నఅధికారులు, టీడీపీ నేతలు

ఏర్పేడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో పలు అభివృద్ధి పనులకు పలు గ్రామాల్లో టీడీపీ నాయకులు, అధికారులు కలిసి భూమిపూజ చేశారు. చిందేపల్లి దళితవాడలో మురుగుకాలువల నిర్మాణానికి, బండారుపల్లిలో, మేర్లపాకలో సీసీరోడ్డుకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తులసీకుమార్, చంద్రశేఖర్, ఏపీవో దేవరి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి, మండలాధ్యక్షుడు పొన్నారావు నాయకులు రమణారెడ్డి, రమణ పాల్గొన్నారు.

కేంద్రమంత్రికి సన్మానం



శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర సూక్ష్మ, చిన్న భారీ పరిశ్రమల శాఖ మంత్రిని శనివారం న్యూఢిల్లీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు కలంకారీ కండువాతో సత్కరించి వెంకటేశ్వరస్వామి కొయ్యబొమ్మను అందజేశారు. ఈ సందర్భంగా దశరధాచారి మంత్రితో మాట్లాడుతూ ఒకసారి రాష్ట్రానికి విచ్చేసి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీలు అందించి ప్రజలను ఆదుకోవాలన్నారు. తిరుపతి జిల్లాను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేయాలని కోరారు. అదే విధంగా శ్రీకాళహస్తి, వెంకటగిరి చేనేతలను ప్రోత్సహించి ఒక మెగాక్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

రైతుల అనుభవంలోని భూమి సర్వే



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 19: (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం రెవెన్యూ సర్వే నెంబరు 81లోని 82 ఎకరాల భూములను ఎట్టకేలకు శనివారం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఈ భూముల్లో కొంతభాగాన్ని 40 సంవత్సరాల నుంచి కుక్కంబాకం దళితులు సాగు చేస్తున్నారు. ఇదే సర్వే నెంబరులో బీఎన్‌కండ్రిగకు చెందిన నలుగురు రైతుల ఆధీనంలో 39 ఎకరాలు ఉంది. ఈ భూములు ఎవరెవరి సాగులో ఉన్నాయని సర్వే చేశారు. సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని గత కొన్ని రోజులుగా దళితులు తహసీల్దార్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయ చుట్టు నిరసన కార్యక్రమాలు చేపట్టిన నేపథ్యంలో తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశాలతో మండల సర్వేతో పాటు సచివాలయ సర్వేయర్లు భూములను సర్వేచేశారు.

సిమెంట్ రోడ్లకు భూమి పూజ



కనమనంబేడులో సిమెంట్ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న నాయకులు, అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీఎస్ పురం, కనమనంబేడు, బీఎన్‌కండ్రిగ, ఆర్ అనంతపురం, చిన్నాయ్యగుంట, పెద్దపాడు, గాజుల పెళ్లూరు, నీర్పాకోట, కాంపాళెం, కుక్కంబాకం, కంచన పుత్తూరు, కారణి పంచాయతీలలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు, గోకుల షెడ్లకు అధి కారులు, తెలుగుదేశం నాయకులు శనివారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయత్ రాజ్ ఏఈ నాగరాజు, ఉపాధి ఏపీఎం భానుప్రియ, మండల పార్టీ అధ్య క్షుడు సుధాకర్ నాయుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, నాయకులు రవినాయుడు, మధునాయుడు, మునిచంద్రనాయుడు, పెంచలయ్య, భూపయ్య, శ్రీనివాసులు, భద్ర, మునిరాజ, శేషయ్య, సర్పంచ్ మాచాలమ్మ కార్తీక్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి లోని చెంబేడు కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగు చూసింది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ వెంకటేశ్వర్లు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించారు. పంచనామా నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తి మృతదేహంగా నమోదు చేసుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. సాలిపేట వీఆర్వో అనిల్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

శ్రీకాళహస్తిలో మోస్తరు వర్షం

శ్రీకాళహస్తిలో శనివారం వేకువజామున మోస్తరు వర్షం కురిసింది. తెల్లవారుజామున ఒకసారిగా ఉరుములు, మెరుపులతో వర్షం మొదలైంది. పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. కాలువలు పొంగి పొర్లాయి.

శ్రీకాళహస్తి సత్యవేడు

నిద్రిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ

ఏర్పేడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న మహిళ మెడలో బంగారు గొలుసును చోరీచేశారు. ఏర్పేడు మండలం గోవిందవరం పంచాయతీ గోవిందరవం బీసీకాలనీకి చెందిన పేరం రవికుమార్, పుష్ప దంపతులు. వీరు శుక్రవారం రాత్రి ఇంటి వరండాలో నిద్రి స్తున్నారు. గుర్తుతెలియని వ్యక్తులు నిద్రిస్తున్న పుష్ప మెడలో 32 గ్రాముల బంగారు గొలుసు అపహరించుకెళ్లారు. గొలుసు విలువ రూ.2లక్షలు ఉంటుంది. బాధిత మహిళ ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగమేళాకు విశేషస్పందన



వరదయ్యపాళెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న సచివాలయంలో జరిగిన ఉద్యోగమేళాకు విశేష స్పందన లభించింది. పలు బహుళజాతి కంపెనీలు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి నిర్మల్‌కుమార్, సర్పంచ్ జ్యోతి, నాయకులు ముని భూషణమ్మ, బీజేపీ నాయకులు జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

రాచగున్నేరిలో పారిశుధ్య చర్యలు



శ్రీకాళహస్తి, అక్టోబరు 19: రాచగున్నేరి పంచాయతీ పరిధిలో శనివారం పారిశుధ్య చర్యలు చేపట్టారు. రాచగున్నేరి పంచాయతీలో పారిశుధ్యం లోపించడంపై శుక్రవారం 'దుర్గంధవలయంలో రాచగున్నేరి' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై గ్రామ సర్పంచ్ నర్రా భార్గవి, మాజీ సర్పంచ్ జగన్నాధంనాయుడు స్పందించారు. శనివారం యంత్రాలతో పంచాయతీలో పెద్దఎత్తున పారిశుధ్య చర్యలు చేపట్టారు.

పిడుగుపాటు మృతులకు నివాళి



పిచ్చాటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమంతపురంలో శుక్రవారం పిడుగుపాటుతో మృతి చెందిన మణి, రాము మృతదేహాలకు వైసీపీ సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, మాజీ మండల కన్వీనర్ హరిశ్చంద్రా రెడ్డి శనివారం నివాళులర్పించారు.

చినుకు పడితే చిత్తడే..!



గుంతలమయంగా ఉన్న దక్షిణ కైలాస్‌నగర్‌రోడ్డు

శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని దక్షిణ కైలాస్ కాలనీ రోడ్డు చినుకుపడితే చిత్తడిగా మారిపోతోంది. ఈ కాలనీ ప్రధాన రోడ్డు నుంచే కొత్త బైపాస్‌రోడ్డుకు వాహనదారులు చేరుకోవాల్సి ఉంది. ఇటు నెల్లూరు మరో వైపు చెన్నైకు వెళ్లాల్సిన వాహనదారులు దక్షిణకైలాస్‌నగర్ కాలనీ రోడ్డుమీదుగా బైపాస్‌రోడ్డుకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఈ కాలనీలో పలు స్పోర్ట్స్ అకాడమీలు ఉన్నాయి. దీంతో వాహనదారులతోపాటు విద్యార్థులు, పిల్లలు, సైకిలిస్టులు రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే రోడ్డుగుంతలమయంగా మారుతోంది. రాత్రివేళల్లో ఈ మార్గంలో ప్రయాణించే వారు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఈరోడ్డును బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇసుక విధానంపై సామాన్యుల హర్షం: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇసుకను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువస్తూ సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవడంపై సామాన్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారని టీడీపీ బీసీ సంఘం నాయ కులు అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లా డారు. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లలలో నదులు, వాగుల, వంకల నుంచి ఎవరైనా ఇసుక తీసుకెళ వచ్చని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమన్నారు. టీడీపీ నాయకులు మిన్నల రవి, ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, శివ, భాస్కర్, మణి, షేక్ జిలానీ, వంశీ, ప్రభాకర్ పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి పండుగ : టీడీపీ



పెద్ద ఈటిపాకంలో భూమిపూజ

సత్యవేడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పల్లె పండుగ కార్యక్రమాలతో పంచాయతీలలో పండుగ వాతావరణం నెలకొందని టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నఈటిపాకం, పెద్ద ఈటిపాకం పంచాయతీలలో శనివారం ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీవో క్రిష్ణయ్య, ఈవోపీఆర్‌డీ తరుణాక్షరెడ్డి, ఇంజనీర్ ఇబ్రహీం ఖాన్, సర్పంచ్‌లు గోవిందస్వామి, రూబెన్, సెక్రటరీ జలజశ్రీ, నాయకులు పరవశివం, శశి మోహన్, సురేంద్రరెడ్డి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం: నాగలాపురం మూడవ సెగ్మెంట్ పరిధిలోని ఈస్ట్ కాలనీలో ఎంపీడీవో బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఎంపీటీసీ ప్రేమ, సెక్రటరీ రమేష్, ఏపీవో యోగరాజ్, మాజీ ఎంపీపీ మురళిపాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్ నివాళులు



ఏర్పేడు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ఇసుకతాగేలికి చెందిన కన్నలి సుబ్రహ్మణ్యం రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆయనకు నివాళులు అర్పించారు.

ముక్కంటి సేవలో ఎక్సైజ్ కమిషనర్



రాహుకేతు పూజల్లో నితీష్‌కుమార్

శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని శనివారం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నితీష్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ప్రత్యేక రాహుకేతు పూజలను చేయించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆయనను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

రైతులకు సూచనలు చేయండి

శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రానున్న రబీ సీజన్‌లో రైతులకు సరైన సలహాలు ఇచ్చి సాయపడాలని వ్యవసాయ జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య అన్నారు. పట్టణంలోని ఏపీసీడ్స్ సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రైతు సేవా కేంద్రాల సిబ్బంది శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో రకాల ఎంపిక, నాట్లు, ఎరువుల యాజమాన్యం, చీడల నివారణపై రైతులకు ఎప్పటికపుడు శాస్త్రీయ సలహాలు అందించాలని సిబ్బందికి సూచించారు. సేంద్రియ ఎరువుల వాడకం పెంచేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏవో వేణుగోపాలరావు, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ మహేశ్వరరెడ్డి, శ్రీకాళహస్తి ఉద్యాన అధికారి పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగమేళాలో 43మంది ఎంపిక



శ్రీకాళహస్తి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలోని ఎస్వీయే పురుషుల డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయి మెంట్ ఎక్స్ఛేంజ్, సిడాప్, డీఆర్‌డీపీ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో నాలుగు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాల కోసం 92మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అందులో 43మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారిని ప్రిన్సిపాల్ శ్రీలత అభినందించారు. అధ్యాపకులు గంగారామ్, గిరిజ, గణేష్, లక్ష్మీ మోహన్, వినయ్, పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు.

సీసీ రోడ్లకు భూమిపూజ

పిచ్చాటూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరులోని ఇందిరానగర్ కాలనీ, పిచ్చాటూరులో, అడవిశంకరాపురం గ్రామంలో సిమెంటు రోడ్ల నిర్మాణానికి టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి , రాష్ట్రపతి అవార్డు గ్రహీత మాజీ సర్పంచ్ పద్మరాజు, మాజీ సర్పంచ్ మణి, అధికారులు, పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ప్రైవేటు బస్సు

- ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు ప్రయాణికులకు గాయాలు



ప్రమాదస్థలాన్ని పరిశీలిస్తున్న ఎంవీఐ దామోదర్‌నాయుడు

ఏర్పేడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మేర్లపాక పుష్పిత్ స్టీల్స్ ప్రైవేటు పరిశ్రమ సమీపంలో పూతలపట్టు -నాయుడుపేట జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఆర్టీసీ బస్సును ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తున్న తల్లికుమార్తెలు శారద, తన్మయకు గాయాలయ్యాయి. ఏర్పేడు పోలీసులు గాయపడిన వారిని 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి వారు పలు ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లారు. శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజరు బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా ఘటనా స్థలాన్ని శ్రీకాళహస్తి ఎంవీఐ దామోదర్ నాయుడు పరిశీలించారు. వాహనాలను రోడ్డుపై ఒకే లైన్‌లో పంపడం వల్ల ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలియజేశారు. రాత్రిపూట వీలైనంత వరకు రెండు వైపులా వాహనాలు పంపేందుకు మెగా కంపెనీ ప్రతినిధులతో మాట్లాడామని తెలిపారు. ఇందుకు వారు అంగీకరించారని వివరించారు.

బాలిక అదృశ్యం

ఏర్పేడు, అక్టోబరు 19: రేణిగుంట మండలం గురవరాజుపల్లికి చెందిన బాలిక (17) అమ్మమ్మ ఊరు అయిన ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామానికి రెండు రోజుల క్రితం వచ్చింది. అయితే ఆమె శనివారం ఉదయం నుంచి గుడిమల్లంలో కనిపించడంలేదు. ఆందోళనకు గురైన ఆమె తల్లి దండ్రులు ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన ఉండాలి

సత్యవేడు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వార్డు మెంబర్లు పంచాయతీ రాజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజులుగా ఎంపీడీవో కార్యాలయంలో మండంలోని ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ తరుణాక్షరెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై గుంతలో చిక్కుకున్న లారీ



వరదయ్యపాళెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వర్షానికి వరదయ్యపాళెం మండలం యానాదివెట్టు వద్ద రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. శనివారం ఓ లారీ ఒక గుంతలో దిగబడిపోయి రోడ్డుపై ఆగిపోయింది. ఇతర వాహ నాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత లారీని పక్కకు తప్పించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈ గుంతల రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, ప్రయాణికులు, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ తిరుపతి జిల్లా అధ్యక్షులు బాలగురవం భరణిబాస్ కోరారు.

